www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 19 | జనవరి | 2025
పేజీలు 8

## చెరువులో దూకి దంపతుల ఆత్మహత్య





ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని బుగ్గపాడులో గల రావి చెరువులో దూకి దంపతులు ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే... బుగ్గపాడు గ్రామానికి చెందిన

మిగతా 2లో..

# పని దినాల ప్రామాణికం సరికాదు



### -ఆత్మీయ భరోసాలో కోతలు
### -భూమి లేని పేదలకు తీరని నష్టం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి లబ్దిదారుల ఎంపికలో కోతల ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతి గ్రామంలోనూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారుల సంఖ్య కనిష్టానికి చేర్చేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నిస్తుంది. ఆత్మీయ భరోసాకు సంబంధించి పని దినాలు ప్రామాణికంగా తీసుకోవడం వల్ల నిజమైన లబ్దిదారులకు నష్టం వాటిల్లుతుందన్న వాదన వినిపిస్తుంది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు కలిగి గతేడాదిలో 20 రోజులు పనిచేసి భూమిలేని నిరుపేదలను ఈ పథకానికి ఎంపిక చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కూలీలు ఏ రోజు కారోజు కుటుంబం గడవటానికి నగదు కావాలి కాబట్టి జాతీయ ఉపాధి హామీ పథకం పనికి వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు. కొన్ని గంటలు మాత్రమే పని ఉండడం మిగతా సమయంలో వేరే పనికి వెళ్లే అవకాశం లేకపోవడం ఒక కారణం కాగా ఉపాధి హామీ పథకం పనికి వెళితే డబ్బులు ఖాతాలో జమ కావడానికి నెల రోజుల నుంచి నాలుగు నెలల వరకు పడుతుంది. రోజు వారి వేతనం కూడా గిట్టుబాటు కాకపోవడంతో జాతీయ ఉపాధి హామీ పథకం పనికి వెళితే కుటుంబ పోషణ నిరుపేదలకు భారంగా మారుతుంది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో పూర్తి కాలం వ్యవసాయ పనుల్లో రైతుల వద్ద పనిచేసే వ్యవసాయ కూలీలే ఎక్కువగా ఉంటారు. వ్యవసాయ పనులు దొరకనప్పుడు మాత్రం తప్పనిస్థితిలో ఉపాధి హామీ పథకానికి వెళ్తున్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితి ఈవిధంగా ఉండగా ప్రభుత్వం మాత్రం 20 రోజులు ఏడాదిలో పనిచేసిన వారినే ఇందిరమ్మ

మిగతా 2లో..

## ఎన్‌టిఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు..



ఘనంగా ఎన్‌టిఆర్ 29వ వర్థంతి

సెంటర్ స్ప్రెడ్

## అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

- నియోజకవర్గాన్ని ఆదర్శంగా మలుస్తాం
- విమానాశ్రయం, కార్పోరేషన్ కల సాకారం కాబోతోంది.
- ఎంఎల్‌ఏ కూనంనేని
- రూ.45 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



2 లో

## అరణ్యాన్ని వీడండి ఆదరిస్తాం

- ఎస్‌పి ఎదుట లొంగిపోయిన 22 మంది మావోయిస్టు మిలీషియా సభ్యులు
- చర్ల పోలీస్ స్టేషన్లో ఆత్మీయ సమ్మేళనం



2 లో

## బిజెపితో రాజ్యాంగానికి ప్రమాదం



2 లో

-ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నంలో కేంద్ర సర్కార్
-జైలుకు వెళ్లేందుకు క్యూలో కేసిఆర్ కుటుంబం
-కొత్తగూడెం విమనాశ్రయం సర్వే వెనుక నా కృషి
-మీడియా సమావేశంలో రేణుకాచౌదరి

# పని దినాల ప్రామాణికం సరికాదు



(మొదటిపేజీ తరువాయి)
ఆత్మీయ భరోసా పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారు. దీనితో భూమిలేని నిరుపేదలు లబ్ధిదారులుగా ఎంపిక కాలేకపోతున్నారు. నేలకొండపల్లి మండలం ముటాపురం గ్రామంలో మొత్తం 606 ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఉండగా 405 జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు వివిధ సమయాల్లో ఉపాధి హామీ పథకం పనికి వెళ్లినట్లు నమోదైంది. కాని ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 110 మంది మాత్రమే అర్హులుగా ఉన్నట్లు ప్రాథమిక నివేదికలో అధికారులు పేర్కొన్నారు. 110 మంది మినహాయిస్తే మిగిలిన వారిలో అనేక మంది ఆత్మీయ భరోసాకు అర్హత కలిగి భూమి లేని నిరుపేదలు ఉన్నా ఉపాధి హామీ పనికి వెళ్లలేదని లబ్ధిదారులుగా ఎంపిక చేయలేదని సమాచారం. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో 752 జాబ్ కార్డులు ఉండగా ఇందులో 276 మంది ఉపాధి హామీ పథకంలో పనులు చేసినట్లు నమోదైంది. ఆత్మీయ భరోసాకు మాత్రం కేవలం 51 కుటుంబాలను మాత్రమే ఎంపిక చేశారు. గూడూరుపాడులోనూ 306 జాబ్ కార్డులకు సంబంధించిన వారు పనిచేసినట్లు రికార్డు కాగా కేవలం 63 కుటుంబాలకు మాత్రమే ఆత్మీయ భరోసాను వర్తింపజేయనున్నట్లు సమాచారం. అనర్హులుగా పేర్కొన్న వారిలో చాలా మంది భూమి లేని నిరుపేదలు ఉన్నారు. రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేదలు లబ్ధిదారులుగా ఎంపిక కాకపోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు పని చేసి సంపాదిస్తే తప్ప పూట గడవని పరిస్థితి ఉందని అందుకే రోజు వారి కూలీకి వెళ్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ రంగంలో ఏడాది పొడవునా పని చేసే ఒప్పందంతో పెద్ద సంఖ్యలో వ్యవసాయ కూలీలు ఉన్నారు. ఇటువంటి వారందరికీ జాతీయ ఉపాధి హామీ పథకంలో 20 రోజులు పనిచేయక ఆత్మీయ భరోసాను కోల్పోతున్నారు. 20 రోజుల పనిదినాలు ప్రామాణికం కాదని భూమి లేని వ్యవసాయ కూలీలందరికీ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని గ్రామీణ పేదలు కోరుతున్నారు.

**పని దినాలు ప్రామాణికం కాదు : తాటి**



జాతీయ ఉపాధి హామీ పథకంలో పని దినాలను ప్రామాణికంగా తీసుకోవడం సరికాదని దీని వల్ల ఎక్కువ మంది పేదలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని బికెఎంయు జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం భూమిలేని నిరుపేదలందరిని ఆత్మీయ భరోసా లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆత్మీయ భరోసాకు సంబంధించి రెవెన్యూ రికార్డుల ఆధారంగా భూమి లేని వారిని ఎంపిక చేయాలన్నారు. దీనిపై ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను పునః సమీక్షించాలని ఆయన కోరారు.

# అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** కొత్తగూడెం నియోజకవర్గం అభివృద్ధి, ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రధాన ఎజెండా అని రమే ప్రధాన ఎజెండా అని,అవడుల్లేని అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందించి నియోజకవర్గాన్ని రాష్ట్రంలో ఆదర్శవంతంగా మలుస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పురుద్ఘాటించారు. స్థానిక మున్సిపాలిటి 27వ వార్డులో గల ప్రగతి మైదానంలో రూ.20 లక్షలు, రూ.25 లక్షలతో చేపట్టనున్న ఎంపవర్మెంట్ అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు జిల్లా కేంద్రంగా ఉన్న కొత్తగూడెం పట్టణాన్ని పట్టణాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు కావాల్సిన మౌళిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ప్రజా అవసరాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వివిధ పథకాల్లో నిధులు మంజూరీ చేయించి పనులు చేపడుతున్నామని, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావుండబోదమని, సమస్యలనే నియోజవర్గాన్ని తీర్చిదిద్దేంత వరకు విశ్రమించేదే లేదన్నారు. నిర్లక్ష్యానికి గురైన క్రీడా రంగంపపై దృష్టి సారించినట్లు చెప్పారు. అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలను, ఓపెన్ జిమ్ములను అభివృద్ధి చేయడంతోపాటు పంచాయితీల వారీగా క్రీడా కారులకు కావాల్సిన ఏర్పాటు చేసి క్రీడాలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తామన్నారు. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండే విధంగా కొత్తగూడెం విమానాశ్రయం నిర్మాణం, హరిత హోటల్, అభివృద్ధికి బాటలు వేసే కార్పోరేషన్ ఏర్పాటు చేయడం తన కలని, వాటిని సాకారం చేయడం సంతృప్తిని కలిగిస్తుందన్నారు. అభివృద్ధి పనులు త్వరిత గతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తేవాలని అధికారులకు సూచించారు. ప్రసాద్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, చైర్‌పర్సన్ సీతాలక్ష్మీ, తహశీల్దార్ పుల్లయ్య, మున్సిపల్ కమీషనర్ శేషాంజన్ స్వామి, డిఇ రవీందర్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ధర్మరాజు, విజయ్ కుమార్, రుక్మేంధర్, వేణు, లక్ష్మణ్, నాయకులు మునిగడపఇ వెంకటేశ్వర్లు, మాచర్ల శ్రీనివాస్, యూసుఫ్, నెరెళ్ల శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, లింగేష్, జోసఫ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో పారిశుధ్య పనులను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. శనివారం అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లాతో కలిసి కమిషనర్ అభిషేక్ అగస్త్య పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇల్లందు క్రాస్ రోడ్డులో వేసిన వాల్ పెయింట్స్‌ను పరిశీలించారు. ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి ఐటి హబ్ వరకు, ఐటి హబ్ నుంచి ఇందిరా నగర్ వరకు పారిశుధ్య పనులకు సంబంధించి గ్యాంగ్ వర్క్స్‌ను కమిషనర్ పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌ను కమిషనర్ పరిశీలించారు. ఏ సమయం నుంచి ఏ సమయం వరకు ఓపెన్ చేస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డబుల్ బెడ్‌రూం, వైఎస్‌ఆర్ నగర్, లకారం ట్యాంక్ బండ్ వెనక వైపు పార్కుల ఏర్పాటుకు వీలున్న ప్రదేశాలను హార్టికల్చర్ అధికారి రాధికతో కలిసి పరిశీలించారు. పార్కుల ఏర్పాటుకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక అందించాలని తెలిపారు.

## పేదరిక నిర్మూలనకు అధిక ప్రాధాన్యతనిచ్చింది ఎన్‌టిఆరే..



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారకరామారావు పేదరిక నిర్మూలనకు అధిక ప్రాధాన్యతనిచ్చి మహిళలకు సముచిత గౌరవం కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్ అని టిడిపి జిల్లా నాయకులు తాతా సుధాకర్, గోపారం కోఆపరేటివ్ సొసైటి మాజీ అధ్యక్షుడు మొత్కూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమం మండల కేంద్రం కొణిజర్లతోపాటు పెద్దగోపతి, పెద్దమునగాల, చిన్నమునగాల, రెడ్డిగూడెం, అనంతారం, అమ్మపాలెం, తీగలబంజర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన ప్రజలమనస్సులో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని అన్నారు. పేదలకోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కుతుందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీతోనే ప్రజలకు న్యాయంజరిగిందని తెలిపారు. నిరుపేదలకు కిలో రూపాయి బియ్యం పథకం ప్రవేశపెట్టి పేదవాళ్ల రెండుపూటలా కడుపునింపా అన్నంతినేలా చేసిన గొప్ప వ్యక్తి ఆయన అని అన్నారు. నిరుపేదలకు ఇళ్లు కట్టించిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని స్పష్టంచేశారు. ఈకార్యక్రమంలో ఎస్‌కె సైదులు, చిట్టిన్ని శ్రీను, సత్యం, గూడె వెంకన్న, వెంకట్, మేడా కృష్ణ, నాగేశ్వరరావు, చెరుకుమల్లి వెంకటేశ్వరరావు, దామా శ్రీను, పెద్దగోపతి మాజీ సర్పంచ్ లక్ష్మణ్, రచ్చ సత్యం, నగేష్, రామమల్లయ్య, ఎస్‌కె అహ్మద్, చింతల మురళి, నరసింహారావు, ఒర్సు ఆంజనేయులు, బండారుపల్లి భాస్కర్‌రావు, దామ వెంకటేశ్వరరావు, కోసూరి సత్యం, సీతారాములు, పెండ్యాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో దూకి దంపతుల ఆత్మహత్య

(మొదటిపేజీ తరువాయి)
పంతంగి కృష్ణారావు (55) ఆటో డ్రైవర్ గా పని చేస్తుండగా, ఆయన భార్య పంతంగి సీత (53) వ్యవసాయ కూలీగా పని చేస్తుంది. ఈ క్రమంలో దంపతుల మృతి చెందటంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. శనివారం శనివారం తెల్లవారుజాము సుమారు 3 గంటల సమయంలో గ్రామ సమీపంలోని రావి చెరువు వద్దకు భార్యభర్తలు నడుచుకుంటూ వెళ్లిన దృశ్యాలు గ్రామంలోని సీసీ కెమెరాల్లో రికార్డవ్వడంతో గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న పోలీస్‌లు హుటాహుటిన చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్యభర్తల మృతిపై పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతులకి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మృతికి ఆర్థిక ఇబ్బందులే కారణమని భావిస్తున్నారు.

# అరణ్యాన్ని వీడండి ఆదరిస్తాం

**ప్రజాపక్షం/భద్రాచలం :** అరణ్యాన్ని వీడి జన జీవనంలోనికి వస్తే తప్పకుండా ఆదరిస్తామని, మీ జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు బాధ్యత తీసుకుంటామని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. శనివారం చర్ల పోలీస్ స్టేషన్‌లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మాజిల్లా, ఎర్రపల్లి ఆర్‌పిసికి చెందిన 22 మంది మావోయిస్టు మిలీషియా సభ్యులు ఎస్‌పి ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ ఆవరణలో లొంగిపోయి, అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు పార్టీ సభ్యుల కుటుంబాలతో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి రోహిత్ రాజ్ మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం పునరావాసాన్ని అందిస్తుందని, ఇందుకు ఆకర్షితులై 22 మంది మిలీషియా సభ్యులు లొంగిపోయారన్నారు. లొంగిపోయిన వారికి వెంటనే పునరావాస ప్యాకేజీని అందించేందుకు కృషి చేస్తామని, గత ఏడాది అజ్ఞాతాన్ని వీడి 36 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారని, మిగితా వారు కూడా లొంగిపోయి కుంటబాలతో సంతోషంగా గడపాలన్నారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో నివశించే ఆదివాసీ ప్రజలకు జిల్లా పోలీస్‌శాఖ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ విద్య,వైద్యం, రవాణా సదుపాయం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివశిస్తూ చదువుకునే యువత ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేస్తామని, ప్రధానంగా వారు ఎదుర్కొంటున్న కుల ధృవీకరణ పత్రాల మంజూరీ విషయంలో జిల్లా కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యే విధంగా ప్రయత్నిస్తామన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివశించే ప్రజలకు అన్ని రకాల పథకాలు అందేలా చూస్తామని చెప్పారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని ఆయన ఈ సందర్భంగా కోరారు. అనంతరం ఆత్మీయసమ్మేళనంలో ఏర్పాటు చేసిన సహపంక్తి విందులో పోలీసులు పాల్గొన్నారు.కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు కృషి చేసిన చర్ల, దుమ్ముగూడెం సిఐలు రాజువర్మ, అశోక్, ఎస్‌ఐ నర్సిరెడ్డిని, పోలీస్ సిబ్బందిని ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

# బిజెపితో రాజ్యాంగానికి ప్రమాదం

**ప్రజాపక్షం/ఖమ్మం :** బిజెపితో భారత రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందని ఆర్‌ఎస్ఎస్ నుంచి వచ్చిన కేంద్ర మంత్రులు రాజ్యాంగాన్ని గౌరవించడం లేదని కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ఆరోపించారు. వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజల కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీని బదనాం చేస్తుందని, బిజెపి కండ బలం ప్రదర్శిస్తుందని ఆమె ఆరోపించారు. శనివారం ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే ఎన్నిక పేరుతో బిజెపి ప్రజలను మభ్యపెడుతుందని రాహుల్ గాంధీపై అనవసర ఆరోపణలు చేస్తుందని ఆమె తెలిపారు. రాజ్యాంగాన్ని వక్రీకరిస్తూ ఈడి, సిబిఐలను ముఖ్యమంత్రులపైకి, ప్రజాప్రతినిధులపైకి ఊసిగొల్పుతుందన్నారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఈడి, సిబిఐలను విపక్ష నాయకులపైకి ఊసిగొల్పుతుందన్నారు. ఆర్‌ఎస్ఎస్ నేతలు భారత రాజ్యాంగాన్ని నమ్మి ప్రమాణం చేసిన అటువంటి వ్యక్తులు భారత రాజ్యాంగాన్ని ఎలా పరిరక్షిస్తారని రేణుకాచౌదరి ప్రశ్నించారు. పార్లమెంటు సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను దూషిస్తే ఇంత వరకు చర్యలు తీసుకోకపోగా దానిని వక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా పని చేస్తుందని ఈ ప్రభుత్వానికి సహకరిస్తే బిఆర్ఎస్‌కు మనుగడ ఉంటుందని లేదంటే అంతర్ధానమవుతుందని ఆమె హెచ్చరించారు. జైలుకు వెళ్లేందుకు కేసిఆర్ కుటుంబం క్యూలో నిలబడిందని కూతురు వెళ్లి వచ్చిందని ఇంకా వెళ్లాల్సిన వారు ఉన్నారని ఆమె తెలిపారు. కొత్తగూడెం ఎయిర్ పోర్టు సర్వేకు ఈనెల 23న కేంద్ర బృందం వస్తుందని పలుమార్లు కేంద్ర విమానయాన శాఖ మంత్రిని కలిసి కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుపై చర్చించినట్లు ఆమె తెలిపారు. విమానాశ్రయం ఏర్పాటైతే కార్గో ద్వారా ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశం ఉందని ఆమె తెలిపారు. సేంద్రియ ఎరువులను వినియోగించి సాగు చేయాలని, ఆర్గానిక్ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని ఆమె తెలిపారు. మీడియా సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ నాయకులు మానుకొండ రాధాకిషోర్, వెంకటరత్నం పాల్గొన్నారు.

## రోడ్డు పక్కన ఆక్రమణ తొలగింపు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను ఖమ్మం కార్పోరేషన్ అధికారులు తొలగించారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం హార్టికల్చర్ అధికారి బెల్లం రాధిక ఆధ్వర్యంలో డిఆర్‌ఎఫ్, పారిశుధ్య సిబ్బంది రోడ్డు పక్కన ఆక్రమణలను తొల గించారు. ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి ఐటి హబ్ వరకు, ఐటి హబ్ నుంచి కోర్టు వరకు రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, పండ్ల వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు, తోపుడు బండ్లను తొలగించారు. కూరగాయల వ్యాపారం కోసం సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఉందని అందులో వ్యాపారం చేసుకోవాలని సూచించారు. పండ్ల వ్యాపారులకు కూడా ప్రత్యేకంగా మార్కెట్‌లో షాపులు ఇవ్వడం జరిగిందని ఎవరు రోడ్డుపై విక్రయాలు జరుపకూడదని అధికారులు తెలిపారు. రోడ్డుపై పండ్లు, కూరగాయలు, ఇతర వ్యాపారాలు నిర్వహించడం వల్ల వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని అధికారులు తెలిపారు. రోడ్డును ఆక్రమించి తోపుడు బండ్లు, ఇతర దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# దేవాలయం అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలి

**మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్ రెడ్డి**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** దేవాలయం అభివృద్ధి కి నూతన పాలక వర్గం కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో రెడ్డిమళ్ల బాబురెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐఎన్టీయూసీ జెండా ను శనివారం ఆవిష్క రించారు. అనంతరం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం పాలకవర్గం చైర్మన్ గా కనమర్లపూడి రమేష్, సభ్యులు గా అనంతు సత్యనారాయణ, కొండబాల రాంబాబు, కైలాసపు కోటేశ్వరి, సీతారాములు, పి.సత్యం లు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ భూముల పరిర క్షణ కు పాటుపడుతున్నారని అన్నారు. దేవాలయం అభివృద్ధి లో పాల కవర్గం భాగస్వామ్యం కావాలని సూచించారు. దేవాలయం కు భూములు ద్వారా, ఇతరత్రా ద్వారా వచ్చే ఆదాయం ను పెంపోందించి దేవాలయం ను మరింత అభివృద్ధి పరచాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో దేవాదాయ శాఖ ఈవో శ్రీకాంత్, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్న పూసల సీతారాములు, మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, మాజీ సర్పంచ్లు వంగవీటి నాగేశ్వర రావు, రాయపూడి నవీన్, రెడ్డిమళ్ల బాబు రెడ్డి, జెర్రిపోతుల అంజిని, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, కడి యాల నరేష్, గుండా బ్రహ్మం, అక్కం ఏడుకొండలు, మామిడిసుభద్ర, గరిడేపల్లి రామారావు, సీతారావమ్మ, జెర్రిపోతుల సత్యనారాయణ, మారుతి కోటి, వడ్డె జగన్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

**-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు**




**ప్రజాపక్షం/బోనకల్:** నిరుపేదల కు రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇల్లు నేర వేర్చాలని, రేషన్‌కార్డుల మంజూరు తర్వాతే పథకాలు అమలుచేయా లని, రేషన్‌కార్డుల సర్వే లిస్టు ప్రజాపాలన ప్రభుత్వనిదా? లేక పైరవీ కారులదా అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యా లయం ఎదుట సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త రేష న్‌కార్డుల కోసం ప్రజాపాలనలో వేలాది మంది దరఖాస్తు చేసుకోని, సమగ్ర కుటుంబ సర్వేలో వివరాలను అధికారులకు వెల్లడించారన్నారు. 22 గ్రామ పంచాయతీలలో రేషన్‌కార్డు సర్వే చేస్తున్న పంచాయతీ కార్య దర్శుల వద్ద ఉన్న జాబితాలో సగానికి సగం మాత్రమే ఉన్నాయని అన్నారు. ఆ జాబితా కూడా ఏ సమయంలో, ఏ ప్రభుత్వం సేకరించిన వివరాలలో అధికారులు కూడా తెలపలేని పరిస్థితి దాపురించదని అన్నారు. రేషన్‌కార్డులకు మంజూరు చేయకుండా పథకాలు అమలు చేస్తే నిజమైన అర్హులకు తీరని నష్టం జరుగుతుందని, ప్రభుత్వం పునరా లోచన చేయాలని సూచించారు. ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథ కాలు అందాలని, లేనియెడల భారత కమ్యూనిస్టు పార్టీ పక్షాన ప్రజాపో రాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యద ర్శులు జక్కుల రామారావు, ఆకెన పవన్, నాయకులు వంగాల కృష్ణ, గుంపుల జయరాజు, రెడ్డిమల్ల సంఘమేశ్వరరావు, నిడిద శ్రీనివాస రావు, వంగాల రామచంద్రరావు, ఏఐవైఎఫ్ నాయకులు జి మనీష్, వై గిరి తదితరులు పాల్గొన్నారు.

# సాగుకు అనుకూలంగా లేని భూములపై సర్వే



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సాగుకు అనుకూ లంగా లేని భూములను గుర్తించేందుకు సర్వే చేపట్టినట్లు కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.సరిత పేర్కొన్నారు. మండలం లోని సింగారెడ్డిపాలెం, కట్టుకా చారం లో శనివారం పర్యటించారు. సాగుకు అనుకూలంగా లేని గుట్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగు కు యోగ్యం లేని భూములను గుర్తించేందుకు క్షేత్ర స్థాయిలో సర్వే చేప ట్టినట్లు తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ జాయింట్ గా సర్వే ప్రారంభించామని పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి సర్వే శర వేగంగా సాగుతుందని పేర్కొన్నారు. సాగుకు అనుకూలంగా లేని భూముల కు రైతు భరోసా ఇచ్చేది లేదని అన్నారు. సాగుకు అనుకూలంగా ఉన్న భూములకు మాత్రమే పథకం వర్తిస్తుందని అన్నారు. గ్రామ స్థాయిలో కస్టర్ వారీగా సర్వే చేస్తున్నట్లుగా తెలిపారు.డివిజన్ వ్యాప్తంగా భూములను గుర్తించిన అనంతరం తహశీల్దార్ లు, ఏవో లు కలిసి చర్చించి పూర్తి నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామ సభలో ఫిర్యాదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి యం.రాధ, మండల రెవిన్యూ ఇన్సెపెక్టర్ బి.రవి, ఏఈవో లు అరవింద్, శిరీష, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం బైపాస్ రోడ్డు సర్వే



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డును అధికారులు సర్వే చేశారు. రోజు రోజుకు ఖమ్మం నగరంతో పాటు బైపాస్ రోడ్డులో ట్రాఫిక్ సమస్య అధికమై తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయి. వాటిని నియంత్రించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించారు. అందులో భాగంగా బైపాస్ రోడ్డుకు సంబంధించి శనివారం రెవెన్యూ సర్వే బృందం సర్వే నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని రాపర్తి నగర్, రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచి వైరా రోడ్డులోని శ్రీశ్రీ సర్కిల్ వరకు సర్వే నిర్వహిం చారు. గతంలో బైపాస్ రోడ్డు కోసం 110 అడుగుల మేర భూ సేకరణ చేశారు. నాలుగు లైన్లుగా బైపాస్ రోడ్డును నిర్మించారు. గతంలో సేకరిం చిన భూమికి సంబంధించి ఎక్కడైనా ఆక్రమణకు గురయ్యాయా లేదా వంటి వివరాలను సేకరిస్తున్నారు. ఆక్రమణకు గురైతే ఎంత మేరకు ఆక్రమణకు గురైంది వంటి వివరాలను సర్వే అధికారులు గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. రాపర్తి నగర్ సెంటర్, నూతన బస్టాండ్ సెంటర్, ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండ డంతో వాటి నియంత్రణతో పాటు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టిసారించినట్లు సమా చారం. అందులో భాగంగానే బైపాస్ రోడ్డుకు సర్వే నిర్వహించి ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫ్లైవర్ నిర్మాణం చేపట్టేందుకు అవకాశాలను గుర్తించనున్నట్లు సమాచారం. రాపర్తి నగర్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు సుమారు మూడు కిలో మీటర్ల మేర ఉన్న ఈ రహదారికి సంబంధించి పలు ప్రాంతాల్లో సర్వే నిర్వహించి గుర్తులు ఏర్పాటు చేశారు. డిప్యూటీ ఇన్స్పెక్టర్, సర్వే అధికారి వెంకట్రావు ఆధ్వర్యంలో ఖమ్మం అర్బన్ సర్వేయర్ నాగేశ్వరరావు, చింతకాని సర్వేయర్ నవీన్, చైర్మన్ బిక్షన్ లు సర్వే నిర్వహించారు.

# ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బిసి స్టడీ సర్కిల్ ఖమ్మం ఆధ్వర్యంలో ఆర్‌ఆర్‌బి, ఎస్ఎస్‌సి, బ్యాంకింగ్ రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని డిగ్రీ పాసైన బిసి, ఎస్సి, ఎస్టి, ఇబిసి అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి అర్హత ఉన్న వారు ఈనెల 20 నుంచి ఫిబ్రవరి తొమ్మిది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ తరగతులు ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ శిక్షణ నాలుగు నెలల పాటు కొనసాగుతుందని ఎంపికైన అభ్యర్థులకు బుక్స్ ఫండ్, ప్రతి నెల స్టయిఫండ్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2లక్షల లోపు ఉండాలని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థుల ఎంపిక విధానం రూల్ ఆఫ్ రిజర్వేషన్, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఫిబ్రవరి 12 నుండి 14 వరకు బిసి స్టడీ సర్కిల్‌లో ఉంటుందని డైరెక్టర్ జి. శ్రీలత తెలిపారు. పూర్తి వివరాలకు 9573859598, 9441931359 నెంబర్లను లేదా బిసి స్టడీ సర్కిల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

# బ్యాంక్ అధికారులతో సిపి సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** కర్ణాటకలోని బీదర్ శివాజీచౌక్ ఏటిఎం వద్ద బ్యాంక్ సిబ్బందిపై దుండగులు దాడి చేసి నగదు చోరిచేసిన ఘటన నేపధ్యంలో జిల్లా పోలీసు యంత్రంగం అప్రమత్తమైంది. పోలీసు కమిషనర్ సునీల్‌దత్ నగరంలోని వివిధ బ్యాంక్ మెనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి భద్రతా చర్యలపై పలు సూచనలు చేశారు. అన్ని బ్యాంకుల వద్ద రాత్రి సమయంలో భద్రత పెంచుతున్నట్లు దీనిపై ఆయా పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్ఓలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రధానంగా భారీమొత్తంలో లావాదేవీలు జరిపే, తరలించే సమయంలో బ్యాంక్‌మేనేజర్ అభ్యర్థన మేరకు ఆరోజు బ్యాంక్ వద్ద పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు చేసేలా సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు ఆదేశాలిచ్చామన్నారు. బ్యాంక్‌కు ఏదైనా ముప్పు, అక్కడికి వచ్చే వారి కదలికలపై అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి వారి సహకారం తీసుకోవాలని సూచించారు. బ్యాంక్ భద్రత దృశ్య బ్యాంక్‌పేరుతో తుపాకి కోసం లైసెన్సులకు దరఖాస్తు చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్లకు సిపి సూచించారు. బ్యాంక్ పరిసరాలు, చుట్టు పక్కల నివాసాలపై ఆరా తీసి నిఘా పెంచి అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులను ఆయన అదేశించారు.

# వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొణిజర్ల పోలీసులు విచారణ




**ప్రజాపక్షం/వైరా:** వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు శనివారం కొణిజర్ల పోలీసులు విచారణ చేపట్టారు. కొణిజర్ల స మీపంలో గ్రీన్‌లాండ్ వెంచర్‌కి సంబంధించి ఒకేరోజు ఎద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ చేయడంతో ఏ విధంగా రిజిస్ట్రేషన్‌చేశారనే దానిపై విచారణ చేశారు. గ్రీన్‌లాండ్ వెంచర్ విషయంలో ఇరు వర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్న నేపథ్యంలో శనివారం కొణిజర్ల పోలీసులు వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. ఆ రోజు ఎన్ని ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారు. ఏ విధంగా చేశారు అనే దానిపై పోలీసులు విచారణ నిర్వహించారు. ఇప్పటికే గ్రీన్‌లాండ్ వెంచర్ విషయంలో నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేశారనే కోణంలో ఉన్నతాధికారులు రిజిస్టర్ రామచంద్రయ్యను సస్పెండ్ చేయడం కూడా జరిగింది. గ్రీన్‌లాండ్ వెంచర్లు జరుగుతున్న పరిణామాలపై ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంఅ మారింది. ముళ్ళ కిషోర్ గిరి ఇద్దరి మధ్య జరిగిన రియల్ పంచాయతీలో ఇరువర్గాలు ఫిర్యాదులతో పోలీసులు కేసు విచారణ ముమ్మరం చేశారు.

# ఎంపిడివో కార్యాలయం ఎదుట సిపిఎం నిరసన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి అర్హులైన వారికి స్థానం లేకుండాపోయిందని సిపిఎం రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్. నవీన్‌రెడ్డి తెలిపారు. శనివారం వ్యవసాయ కూలీలతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో రఘునాథపాలెం ఎంపిడివో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎంపిడివోకు వినతి పత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ కూలీలు వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారని అది అమల్లోకి వచ్చే నాటికి ఊరికి 20 నుంచి 30 పేర్లు మాత్రమే అర్హులుగా ప్రకటించారన్నారు. ఉపాధి హామీ పథకం పని దినాలను సాకుగా చూపెడుతూ అర్హులైన కూలీలందరిని ఈ పథకం నుండి అనర్హులుగా మార్చారన్నారు. పలు గ్రామాల్లో సెంటు భూమి కూడా లేని నిరుపేదలను ఈ పథకంలో చేర్చ లేదన్నారు. స్థానిక వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సమస్యపై దృష్టిసారించి అర్హులైన పేదలందరికి ఈ పథకం అమలయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూచిపూడి నరేష్, షేక్ రహీమ్, మైబు, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



**ప్రజాపక్షం/ముదిగొండ :** మాజీ సీఎం, స్వర్గీయ నందమూరి తారక రామారావు 19 వర్ధంతి పురస్కరించుకుని శనివారం ముదిగొండ మండల బీఆర్ఎస్ పార్టీ ఆద్వర్యంలో ముదిగొండ, వల్లబి గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ తరువాత ఆయా గ్రామాల్లో సుమారు రెండు వందల మంది కార్యకర్తలు బైక్ పై ఎన్టీఆర్ జిందాబాద్, ఎన్టీఆర్ అమరహై అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, మాజీ రైతు బంధు మండల చైర్మన్ పోట్ల వెంకట ప్రసాద్, మండల నాయకులు బంకా మల్లయ్య, పాము శిల్వరాజు, శంకర్, లాలు, శ్రీకాంత్, గురు మూర్తి, కోటి అనంతరాములు, కొత్తపల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## మంచంలోనే సజీవదహనమైన వృద్ధుడు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని రాజేశ్వరపురం గ్రామానికి చెందిన బత్తిని వెంకులు (75) అనే వృద్ధుడు తను పడుకున్న మంచంలోనే మంటలకు ఆహుతైయ్యాడు. శనివారం తన కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఇంట్లో ఒంటిరిగా ఉన్న వెంకులు, తనకు చుట్ట తాగే అలవాటు ఉండటంతో చుట్ట ను తాగీన తరువాత ఆర్పినట్లుగా భావించి మంచం పైనే పెట్టుకుని ఉండటం వలన మంటలు వ్యాపించి ఉంటాయని, శరీరం సహకరించక మంచం పై నుంచి లేచే స్థితిలో లేకపోవటం వలన మంటలలో సజీవ దహనమైనట్లు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బంధువులు, మృతదేహం ను సందర్శించి బోరున విలపించారు. గ్రామస్తులు పలువురు ఘటనా స్థలం ను సందర్శించారు. మృతుడు కు ఇరువురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

## ఘనంగా ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి



**ప్రజాపక్షం/మణుగూరు రూరల్:** మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయనందమూరి తారక రామారావు 29వ వర్ధంతి వేడుకలను మణుగూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని అన్ని పార్టీల నుంచి నాయకులు వచ్చి ఎన్టీఆర్ కి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు వాసిరెడ్డి చలపతిరావు, సమితి సింగారం మాజీ సర్పంచ్ బచ్చల భారతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కిరెడ్డి సంజీవరెడ్డి, తుడుం దెబ్బ పార్టీకి చెందిన నాయకులు అలెంకోటి, పెద్ద ఎత్తున ప్రజలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఈ నెల 20న టేకులపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న తెలంగాణ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎదలాపురం గోపాలరావు, తెలంగాణ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు రాయల సిద్దులు కోరారు. శనివారం జూలూరుపాడు మండల కేంద్రంలో ఆటో కార్మికులతో కలిసి మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మికులు నేలాల నవీన్, కత్తి సాయి, నేలాల సీతారాములు, నూక పోగు రాంబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ విద్యతో మంచి అవకాశాలు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలను మాజీ జేఎన్‌టీయూ హెచ్, యూపిఎస్‌సి మెంబర్, ఏపిపిఎస్‌సి మాజీ చైర్మన్ డాక్టర్ వై.వెంకటరామిరెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ తన విద్యాభ్యాస అనుభవాలను పంచుకుంటూ, ప్రస్తుత రోజులలో ఇంజనీరింగ్ విద్య చాలా విలువైనదని, దానిని సరిగ్గా సద్వినియోగ పరుచుకుంటే జీవితంలో మంచి అవకాశాలు ఉంటాయని అన్నారు. జేఎన్‌టీయూహెచ్ అనుసంధాన కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు విదేశాలలో మంచి ప్రముఖ్యత ఉంటుందన్నారు. ఈ నూతన విద్యా విధానం కొత్త టెక్నాలజీని ఏర్పార్చడంలో మీకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే కళాశాలను ఉద్దేశించి చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు, సెక్రటరీ డాక్టర్ చావా లక్ష్మీ నారాయణ కాలేజీని మంచిగా అభివృద్ధి చేస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి విద్యను అందిస్తూ, దేశ విదేశాలలో కూడా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తు పేద విద్యార్థుల తల్లిదండ్రుల కోరికలు నెరవేర్చడంలో సహకరిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావు, సెక్రటరి డాక్టర్ చావా లక్ష్మీ నారాయణ, ప్రిన్సిపాల్, అన్ని శాఖల అధిపతులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులకు బానిసలుగా మద్యం బాబులు..!

### యువత చేతిలోనే బెల్ట్ షాపులు



**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల పరిధిలోని గ్రామాల్లో బెల్ట్ షాపుల జోరు ఇంత అంత కాదు. మండల కేంద్రంలో బడి, గుడి అని తేడా లేకుండా దమ్మపేట పట్టణం నడిబొడ్డున, ఇల్లు మాటున యథేచ్ఛగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణాలు తెరవక ముందు, మూసి వేసిన తర్వాత మద్యం ప్రియులంతా బెల్ట్ షాపులనే ఆశ్రయిస్తున్నారు. మద్యం దుకాణాలు తెరచి ఉన్న అమాయక గిరిజనులకు కావలసిన తక్కువ ఖరీదైన బ్రాండ్లు మద్యం దుకాణాల్లో లభించక పోవడంతో బెల్ట్ షాపులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ విచిత్రం ఏమిటి అంటే మద్యం షాపుల్లో లభించిన ఎన్నో బ్రాండ్లు బెల్ట్ షాపుల్లో దొరకటం ఆశ్చర్యకరానికి గురిచేస్తుంది. ఇక గ్రామాల్లో హోటల్, దాబాలు, కిరాణా దుకాణాల మాదిరిగా ఉన్నప్పటికీ లోపల తతంగమంతా వేరేలా ఉంటుంది. మద్యం విక్రయాలతో పాటు అక్కడే తాగేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కూర్చుని సంపాదించే మార్గంగా బెల్ట్ షాపులను ఎన్నుకుంటున్నారు. మద్యం సీసా, బీర్ల పై అదనంగా రూ. 20 నుంచి 30 వరకు వసూళ్లు చేస్తున్నారు. చిన్న బెల్టు షాపు అయిన రోజుకు ఎంత లేదన్నా రూ. 1500 నుంచి రూ. 3000 వరకు ఆదాయం వస్తుండడంతో బెల్ట్ షాపుల నిర్వహణపై చాలా మంది యువకులు మొగ్గు చూపుతున్నారు. కొన్ని రోజుల క్రితం బెల్ట్‌షాపులు వలన ఎన్నో కుటుంబాలు రోడ్డున పడటం, భార్యాభర్తలు విడిపోవడం, కన్నబిడ్డలను చదువు మాన్పించేసి మద్యానికి బానిసైన తల్లిదండ్రులు డబ్బుల కోసం కన్న బిడ్డలను వేరే పనికి పంపించడం చూసి మనసు చలించి ఈ బెల్ట్ షాపులను ఎలాగైనా అరికట్టాలని అనే ఉద్దేశంతో మండల కేంద్రానికి సంబంధించిన ఒక యువ న్యాయవాది బెల్ట్ షాపుల గురించి హైకోర్టులో ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ విషయం బహిరంగంగా అందరికీ తెలిసినా అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకపోగా బెల్ట్ షాపులు సంఖ్య మరికొన్ని పెరగటం ఆశ్చర్యాన్ని గురిచేసింది.

**టార్గెట్ కోసం అధికారులు చూసీచూడనట్లు..**

బెల్ట్ షాపుల్లో ఇంత బహిరంగంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా.. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. అధికారులకు నెలవారీగా విధించే మద్యం అమ్మకాల టార్గెట్ కోసం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మండల కేంద్రంలోనే సుమారు 10 నుంచి 20 బెల్ట్ షాపులు నడుస్తున్నట్టు అంచనా. కానీ చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తుండటంతో వీరి అక్రమాలకు అంతే లేకుండా పోయింది. ఏది ఏమైనా పట్టణ గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్ షాపులను నియంత్రించాలని ప్రజాసంఘాలు, మహిళలు కోరుతున్నారు.

**ఆంతర్యం ఇదే...**


ఏ4 రిటైల్ దుకాణంలో ఎమ్మార్పీకే మద్యం అమ్మాలి. వ్యాపారులు లాభాల కోసం బెల్టు షాపుల మీద ఆధారపడుతున్నారు. బెల్ట్ షాపులకు క్వార్టర్ బాటిల్ ఎమ్మార్పీ మీద రూ.10, ఫుల్ బాటిల్‌కు రూ. 50 చొప్పున అదనపు ధరకు విక్రయిస్తున్నారు. ఇక బెల్ట్ షాప్ ఓనర్లు మరో రూ.10 నుంచి రూ.50 లాభానికి విక్రయిస్తున్నారు. ఈ లెక్కన ఎమ్మార్పీ మీద రూ.20 నుంచి రూ.100 వరకు ఉల్లంఘన జరుగుతున్నది. అక్రమ మద్యాన్ని అరికట్టడమే కాకుండా ఎమ్మార్పీ ఉల్లంఘను నివారించటం ఎక్సైజ్ శాఖ, జిల్లా టాస్క్‌ఫోర్స్ (డీటీఎఫ్), స్టేట్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్), ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల పని. కానీ ఈ విభాగాలన్నీ ఎమ్మార్పీ ఉల్లంఘనను అరికట్టలేకపోతున్నాయి. ఇందుకు వారికి ప్రతి నెలా మామూళ్లు అందటమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**యువత చేతిలోనే బెల్ట్ షాపులు...**

మండలంలో నడుస్తున్న మొత్తం బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్న వారిలో 80 శాతం మంది పదో తరగతి నుంచి డిగ్రీలోపు చదువుకున్న యువకులే ఉన్నారు. ఉపాధి లేక, వ్యవసాయ పనులు చేసుకోలేక మద్యం వ్యాపారాన్ని ఎంచుకుంటున్నారు.

# తేల్చనున్న కూలీల లెక్క..!

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం




**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఆయా కుటుంబాలకు ప్రతి ఆరు నెలలకో సారి రూ.6 వేలను ఖాతాల్లో జమచేయనున్నారు. లబ్దిదారుల ఎంపిక పూర్తి చేసి వారికి ఈ నెల 26వ తేదీ నుంచి పథకం వర్తింపజేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో ఉపాధి హామీ పథకం లెక్కలు తీస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా 2023 ఏప్రిల్ నుండి 2024 ఏప్రియల్ వరకు వార్షిక ఏడాదిలో 20 రోజులు, అంతకంటే ఎక్కువ పనిదినాలకు వెళ్ళిన ఉపాధి హామీ కూలీలకు ఈ పథకం వర్తిస్తుందని, జిల్లా నుండి ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది.

**ధరణితో పోల్చి...**

ఉపాధి కూలీల జాబ్‌కార్డులను ఇప్పటికే ఆధార్‌తో అనుసంధానం చేశారు. దీని ఆధారంగానే కూలీలకు బ్యాంకు ఖాతాల ద్వారా కూలి చెల్లిస్తున్నారు. పెనుబల్లి మండలంలో 1842 కుటుంబాలను ఉపాధి హామీ పథకం అధికారులు గుర్తించారు. అట్టి కుటుంబ వివరాలను ధరణి పోర్టల్‌తో క్రాస్ చెక్ చేస్తారు. ధరణిలో భూమి లేని వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేస్తారని నిబంధనల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా గ్రామ సభలు నిర్వహిస్తారని, అట్టి గ్రామసభల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖ, ఉపాధి హామి శాఖ అధికారులు పాల్గొని లబ్దిదారుల పేర్లను వినిపిస్తారని ఆ సందర్భంలో భూమి లేని వారిని గుర్తించి అర్హులైన వారిని ప్రకటించి నోటీస్‌బోర్డులో తెలియజేస్తారని అధికారులు తెలిపారు.

**తక్కువ విస్తీర్ణం ఉంటే...**

ప్రస్తుతం మండలంలో చాలా కుటుంబాలకు రెండు గుంటలు అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో భూమి ఉంది. గుంట విస్తీర్ణం ఉన్న వారికి కూడా మొన్నటి వరకు రైతుబంధు కింద రూ.250/ల చొప్పున అంజేశారు. ఈ విధంగా పది గుంటల విస్తీర్ణం వరకు కలిగిన రైతులు ఉన్నారు. ఇలాంటి వారు నిత్యం దినసరి కూలీలుగానే పనిచేస్తున్నారు. మరి కొందరు ఇతర రంగాల్లో పని చేసుకుంటున్నారు. కొందరు ఉపాధిహామీ పనులకు వెళ్లకుండా వ్యవసాయ, వ్యవసాయేతర కూలీలుగా పనిచేసుకుంటున్నారు. అలాంటి వారు అధికారులు రూపొందించిన ఉపాధి హామీ కూలీల వివరాల్లో కనిపించే అవకాశం లేదు. వీరికి ఆత్మీయ భరోసా పథకం వర్తిస్తుందా లేదా అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. పథకాలన్ని గణతంత్ర దినోత్సవం నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది.

## దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** రెండు కాళ్లు పనిచేయకపోవడంతో మంచానికే పరిమితమైన దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను వితరణగా అందజేశారు. పెనుబల్లి మండలం పాత కారాయిగూడెం తండాకు చెందిన గుగులోతు భద్రు కు చిన్నతనం నుండి ఒక కాలు పని చేయకపోయినా కష్టపడి డిగ్రీ పూర్తి చేసి బిఈడి కోర్స్‌లో జాయిన్ అయ్యాడు. కోర్సు పూర్తిచేసే సమయానికి రెండవ కాలు కూడా చచ్చుపడిపోయి మంచానికే పరిమితం అయ్యాడు. దీంతో పరీక్షలు రాయలేక బిఈడి కోర్సు పూర్తిచేయలేదు. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు మంజూరు చేయలేదు. తన భార్య కూలీకి వెళితేకానీ ఇంట్లో పూటగడవని పరిస్థితి. తనకు వీల్‌చైర్ అవసరం వుందని మండాలపాడు గ్రామానికి చెందిన జోనేబోయిన అన్నపూర్ణని సంప్రదించగా తాను నిర్వహించే జోనేబోయిన చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 7 వేల రూపాయలు విలువైన వీల్‌చైర్ ను శనివారం తన భార్య కృష్ణవేణి కి అందజేశారు. తమ కూతురు చదువుకుంటుందని, ఆర్థిక స్థోమతలేని తమ కుటుంబాన్ని దాతలు ఆదుకోవాలని కోరారు.

# ఎన్‌టిఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు..

### -ఘనంగా ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి









**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సినిమా రంగంతో పాటు రాజకీయ రంగంలో తనదైన ముద్రవేసి స్వర్గీయ నందమూరి తారక రామారావు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పలువురు నాయకులు తెలిపారు. శనివారం నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా టిడిపి, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నాయకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సినీ, రాజకీయ రంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ మైసమ్మ గుడి వద్ద టిడిపి నగర కమిటీ, వనమా వాసు ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఉద్యోగ సంఘాల నేతలు, ఎన్‌టిఆర్ అభిమానులు హాజరై ఎన్‌టిఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి భారతదేశ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన లెజండ్ ఎన్‌టిఆర్ అని తెలిపారు. భారతదేశంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతికి ఒక గుర్తింపు తీసుకు వచ్చారన్నారు. కిలో రెండు రూపాయల బియ్యం, గూడు లేని వారికి ఇండ్లు, జనత వస్త్రాలు, పటేల్ పట్వారి వ్యవస్థ నిర్మూలన వంటి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఎన్‌టిఆర్‌కు భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్ఏలు కొండబాల కోటేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, మాజీ ఎంఎల్‌సిలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మి నారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసిరెడ్డి రామనాథం, కొండబాల కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నల్లమల వెంకటేశ్వరరావు, సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, టిజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, టిఎన్‌జీవో జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, చింతనిప్పు కృష్ణచైతన్య, కార్పొరేటర్లు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు. బిజెపి జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**పలు ప్రాంతాల్లో అన్నదానం...**

ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం నగరంలో పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా టిడిపి రాష్ట్ర నాయకులు కేతినేని హరీష్ చంద్ర ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ సర్కిల్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు. త్రీటౌన్ హర్కార బావి సెంటర్‌లో ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని టిడిపి రాష్ట్ర నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు.

# మరమ్మతుల వేళ.. ప్రయాణికుల గోల..!





**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డిపల్లి మండల ప్రధాన రహదారి నుండి జిల్లా కేంద్రం కొత్తగూడెంకు వెళ్లే రహదారి మార్గమధ్యంలో పెనగడప క్రాస్ రోడ్డు నుండి అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రం వరకు ఉన్నటువంటి బీటీ రోడ్డు సుమారు 17 కిలో మీటర్ల మేరకు ఉన్న రోడ్డుపై జిల్లా కేంద్రం నుండి మండల కేంద్రాల వరకు వచ్చి పోయే ప్రయాణికులతో నిత్యం రద్దీగా మారిపోయింది. ప్రస్తుతం ఈ రోడ్డుపై ప్రమాద స్థాయికి మించిన గుంతలు ఏర్పడినాయి. ఈ గుంతలను పూడ్చేందుకు గతంలో రెండు సంవత్సరాలుగా మరమ్మత్తు పనులను..ఒక గుత్తేదారుకు అప్పగించడం వలన అతను పూర్తి స్థాయిలో పనులు చేయకుండా అరకోరా పనులు చేసి అధికారులు, ప్రజాప్రతినిధుల పేర్లను చెప్పుకొని బిల్లు చేసుకున్నారు. సంవత్సర కాలం గడవకముందే రోడ్డంతా గుంతల మయంగా అయింది. మళ్లీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను ఇదే గుత్తేదారుకు అప్పగించారు. ఈ విధంగా చేయడం వలన ఈ సారి ఈ రోడ్డు మరమ్మత్తు పనులు కాంట్రాక్టర్‌కు కల్పతరువుగా మారిపోయింది. గత కొన్ని నెలల క్రితం చేసిన పనులలో రోడ్డు మొత్తంలో 12గుంటలు పడగా 12లక్షల రూపాయల వ్యయంతో సదరు గుత్తేదారుకు అప్పగించారు. గుంటకు 1లక్ష రూపాయల చొప్పున ఏ పని చేయకపోయినా 12లక్షల రూపాయల ప్రజాధనం మాత్రం వ్యర్థమైపోయింది. చేసే పనులలో నాణ్యత లేకుండా పోవడం ..ఒక సారి నాణ్యత లేకుండా పోసిన రోడ్డు పనుల విషయంలో అధికారులు చర్యలు తీసుకోకుండా మరల అదే గుత్తేదారుకు ఈ పనులను అప్పగించడం జరిగింది. ఎటువంటి ప్రణాళిక లేకుండా ఎక్కడపడితే అక్కడ రోడ్డుని తవ్వి కంకర పోశారు. పోసినప్పుడు నుండి ఇంత వరకు వాటర్ క్యారింగ్ చేయట్లేదు. రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ రాళ్లు పైకి తేలి ఉన్నాయి. ఈ విధంగా ఉన్న రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ప్రమాదాలు జరుగుతున్నాయ. ఇంత జరుగుతున్న అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. కల్వర్టు కింద వేసే పైపులు కూడా నాణ్యత లోపం వలన రవాణాలోనే పగిలిపోవడం జరిగింది. ఇంత జరుగుతున్నా కూడా అధికారులు ఇతని కాంట్రాక్ట్ లైసెన్స్ రద్దు చేయకుండా, చోద్యం చూస్తున్నారంటూ అసలు దీని వెనక అధికారులా అందదండలు ఉన్నాయా లేక రాజకీయ నాయకుల పలుకుపడి ఉందా అనే కోణంలో ఎన్నో అనుమానాలకు తావిస్తున్నాయని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. మరొక సారి అదే కాంట్రాక్టర్‌కు ఈ పని ఇచ్చి పిచ్చోడి చేతిలో రోడ్డు పెట్టారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈసారి రోడ్డునే మాయం చేసే విధంగా పనులు చేస్తున్నాడని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌ను మార్చి పనులపై పర్యవేక్షణ చేసి గుత్తేదారుతో నాణ్యమైన పనులు చేయించి రోడ్డుకు భద్రతను కల్పించవలసిందిగా మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# లబ్ధిదారుల ఎంపిక.. 20వ తేదీ వరకు వెరిఫికేషన్

**ప్రజాపక్షం/మణుగూరు:** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయబోయే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇండ్లు పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఈ నెల 20వ తేదీ వరకు వెరిఫికేషన్ జరుగుతుందని మణుగూరు తహశీల్దార్ రాఘవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సమగ్ర ఇంటింటి సర్వే నాడు ఎవరైతే రేషన్ కార్డు లేదు అని సమాచారం ఇచ్చారో వారి లీస్ట్ రాష్ట్ర ప్రభుత్వం వారి ద్వారా పొంది వెరికేషన్ చేయటం జరుగుతుందన్నారు. ఒకవేళ ఇంటింటి సర్వే లో పాల్గొని, రేషన్ కార్డు లేదు అని సమాచారం ఇచ్చినా కూడా పై నుండి వచ్చిన లీస్ట్ లో అర్హులై వుండి మీ పేరు లేకుంటే ఈ నెల 23 వ తారీకు లోపు తహశీల్దార్ కార్యాలయం లో గానీ, ఎంపిడిఓ కార్యాలయంలో గానీ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు జిరాక్స్‌లు సమర్పించినచో వివరాలు ప్రభుత్వానికి సమర్పించి రేషన్ కార్డు మంజూరు కోసం తగు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27వ వర్ధంతిని సందర్భంగా బూర్గంపాడు మండల తెలుగుదేశం, ఐటిసి పిఎస్‌పిడి టిఎన్‌టియూసి ఆధ్వర్యంలో మండలంలోని నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సరోజినీ వృద్ధాశ్రమం నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం టిఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ తెలుగు ప్రజల కీర్తిని దేశ విదేశాల్లో చాటి చెప్పిన ఘన కీర్తి కేవలం ఒక్క ఎన్టీఆర్‌కి మాత్రమే దక్కుతుందన్నారు. అనంతరం టిఎన్‌టియూసి అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్ మాట్లాడుతూ తెలుగు చలన చిత్ర రంగంలోనే కాకుండా ముఖ్యమంత్రిగా మకుటం లేని మహరాజుగా కీర్తి గడించారన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా తెలుగుదేశం నాయకులు కంచేటి వెంకటేశ్వరరావు, టిఎన్‌టియూసి చైర్మన్ గల్లా నాగభూషయ్య, మండల తెలుగుదేశం నాయకులు కాకర్ల సత్యనారాయణ, క్రీ రాజేంద్రప్రసాద్, జీవన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రమేష్, నెట్టెం భాస్కర్, చలపతి, కరి వెంకన్న, కుందేటి శ్రీనివాస్, రామచంద్ర మౌళి, పెరుగు నాగేశ్వరరావు, టిఎన్‌టియూసి పార్లమెంట్, నియోజకవర్గస్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నవోదయ ఆరో తరగతి నందు ప్రవేశ పరీక్ష శనివారం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి ఎదు సింహారాజు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 171 మంది విద్యార్థులకు గాను 140 మంది హాజరయ్యారని, 31 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష ఉదయం 11:30 గంటల నుండి మధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 10గంటల వరకు చేరుకున్నారని అన్నారు. పరీక్షా కేంద్రంలో 8 మంది ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపర్డింట్‌గా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రవిలా దేవి వ్యవహరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పరీక్షా కేంద్రంలో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

## విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించం

### -జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి భాస్కర్ నాయక్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిలేదని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి భాస్కర్‌నాయక్ స్పష్టం చేశారు. శనివారం చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం గ్రామంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని, సంబంధిత రికార్డులను సైతం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేండ్లలోపు పిల్లలకు తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ప్రభుత్వ సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సైతం గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయన్నారు. ఆయన వెంట డిఐఓ బాలాజీ, సిహెచ్‌ఓ నాగభూషణం, మెడికల్ ఆఫీసర్ కనకం తనూజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్‌టిఆర్ వర్ధంతి



**ప్రజాపక్షం/కారేపల్లి:** ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మాజీ తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు డొంకెన రవి కారేపల్లి సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నటుడిగా, నాయకుడిగా, సీఎంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. ఎన్టీఆర్ తనకు తానే సాటి అని చెప్పారు. పేదల కోసం ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తు చేశారు. ఎన్టీఆర్‌తోనే తెలుగు వారిలో రాజకీయ చైతన్యం వచ్చిందన్నారు. ఎన్టీఆర్ సాహసోపేతమైన పథకాలను అమలు చేశారని ఉద్ఘాటించారు. ఈకార్యక్రమంలో బాలాజీ హోటల్ యజమాని రాము, చిన్ని శ్రీవాస్, గంగరబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం నాలుగో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి





**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 25, 26, 27, 28 తేదీలలో సంగారెడ్డిలో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు కోరారు. శనివారం శ్రామిక భవనం సిపిఎం కార్యాలయంలో మహాసభల పోస్టర్ల ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ మహాసభలకు సిపిఎం పొలిటి బ్యూరో నాయకులు కామ్రేడ్ బృందాకరత్, బివి రాఘవులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొడిశాల రాములు, సిపిఎం మండల కమిటీ సభ్యులు పిట్టల నాగమణి, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

## మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి

# బడే చొక్కారావు అలియాస్ దామోదర్ హతం


भारत की कम्युनिस्ट पार्टी (माओवादी)
दक्षिण बस्तर डिविजनल कमेटी



- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి
- నిర్ధారించిన మావోయిస్టు పార్టీ
- ఆయనపై రూ.50 లక్షల రివార్డు
- పార్టీకి భారీ ఎదురుదెబ్బ

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌ఘడ్‌లో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ హతమయ్యారు. ఈ విషయాన్ని ఆ పార్టీ శనివారం విడుదల చేసిన లేఖలో నిర్ధారించింది. ఆ ఎన్‌కౌంటర్‌లో మొత్తం దామోదర్‌తో సహా 18 మంది మావోయిస్టులు హతమైనట్లు మావోయిస్టు బస్తర్ ఏరియా కార్యదర్శి గంగ ఆ లేఖలో పేర్కొన్నారు. అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మృతితో 30 ఏళ్ల అజ్ఞాతానికి తెరపడినట్లు అయ్యింది. మోస్టువాంటెడ్‌గా ఉన్న ఆయన తలపై రూ.50 లక్షల రివార్డు ఉంది. ఆరు నెలల క్రితమే రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలు చేపట్టిన చొక్కారావు అనేక విధ్వంసకర కార్యక్రమాల్లో పాల్పంచుకున్నారు. ఆయనపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు చిన్నతనంలోనే మావోయిస్టు ఉద్యమానికి ప్రభావితమై అజ్ఞాతంలోనికి వెళ్లాడు. దామోదర్ తోపాటు మరో తెలుగు మావోయిస్టు నేత నర్సింహా రావు కూడా మృతుల్లో ఉన్నట్లు విడుదలైన లేఖలో పేర్కొన్నారు. బడే చొక్కారావు మృతితో మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగినట్లు అయ్యింది. గత ఏడాది నుండి ఇప్పటి వరకు జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ వరుసగ నష్టాలను చవిచూస్తుండగా ఇప్పుడు అగ్రనేతను కోల్పోయింది. చొక్కారావు మృతితో ఆయన స్వగ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి.

# దేశంలో సంక్షేమ పాలనకు ఆధ్యుడు ఎన్‌టిఆర్



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి పార్లమెంటరీ కార్య నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి చలపతి రావు ఆధ్వర్యంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ సీఎం, అన్న నందమూరి తారక రామారావు 29 వ వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మహానటుడిగా, ప్రజానాయకుడిగా ఒకే జీవితంలో రెండు చరిత్రలు సృష్టించిన శకపురుషుడు ఎన్టీఆర్. ప్రజాహిత పాలనకు, సంక్షేమ పథకాలకు ఆద్యుడిగా, తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా, జాతీయ రాజకీయాలకు సరికొత్త దిశా నిర్దేశం చేసిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అభ్యుదయభావాలు, సమసమాజ సిద్ధాంతాలతో, సంస్కరణలతో తెలంగాణ ప్రాంతం పై తనదైన ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నేతలు మాజీ సర్పంచ్ బచ్చల భారతి, మల్లిడి లోకేష్, పాలవాయి సుధాకర్, షేక్ ఖమురున్నీసా బేగం, లాలయ్య, చావా రామారావు, ఎం రాజేష్, వై మల్లయ్య, గుండా రామచంద్రయ్య, యార్లగడ్డ రాజా, పోశం అశోక్, కంసాని శ్రీను, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు,బచ్చల సుమేష్, సిహెచ్ సతీష్, బుల్లేశ్వరరావు, అబ్దుల్ నబీ, ఏ శ్రీనివాసరావు, మద్దెల భద్రయ్య, చెన్నకేశవ, ఎం వెంకటేశ్వర్లు, పూర్ణ, హరి, మహిళా నేతలు చావా శ్రీదేవి, రమ, కృష్ణకుమారి, ఆదిలక్ష్మి , సంధ్య, ఎల్లమ్మ, లక్ష్మి , ముమ్మనేని సత్యనారాయణ, బ్రహ్మయ్య, పట్టణ ప్రముఖులు మరియు ఎన్టీఆర్ వీర అభిమానులు మాజీ సర్పంచ్ డీవీ, కూచిపూడి బాబు, గండ్ల సురేష్, రామారావు, త్రిమూర్తులు, కేతినేని హరి, మేదరమెట్ల నాగేశ్వర రావు, మెదరపట్ల శ్రీనివాసరావు, మీసాల దుర్గారావు, భోగినేని వర లక్ష్మి , కుర్రం రవి, సోమేశ్వరరావు గౌడ్, కుర్రి నాగేశ్వరరావు, అక్కిరెడ్డి సంజీవరెడ్డి, అలెం కోటి, తదితర ఎమ్మార్పీఎస్ మరియు ఆదివాసి సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దమ్మపేట మండలంలో ఘనంగా ఎన్‌టిఆర్ వర్ధంతి



**ప్రజాపక్షం/దమ్మపేట:** ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శనివారం ఎన్టీఆర్ అభిమానులు, టిడిపి నాయకులు మరియు కాంగ్రెస్ నాయకులు మండల పరిధిలోని దమ్మపేట, మందలపల్లి, నాచారం, నాగుపల్లి, పట్వారి గూడెం గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్వగ్రామం గండుగులపల్లి సెంటర్లో ఉన్న నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమూల్యమైన సేవలు అందించిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా ఆయనను స్మరించుకుంటూ నందమూరి తారకరామారావు ప్రజల కోసం నిరంతరం పని చేసిన ఆదర్శవంతమైన నాయకుడు మాత్రమే కాకుండా ఒక సమర్థవంతమైన పాలకుడిగా తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారన్నారు. తెలుగు భాష సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచమంతటా గుర్తింపు పొందడానికి ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మనమందరం ఆయన ఆదర్శాలను ఆచరిస్తూ ప్రజల కోసం కష్టపడితే అది మన స్వర్గీయ నేతకు నిజమైన నివాళి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, టిడిపి మండల అధ్యక్షుడు వాలీబాషా, టిడిపి నాయకులు గడ్డిపాటి సత్యనారాయణ, సొసైటీ వైస్ చైర్మన్ కట్ట ఎర్రప్ప, బోల్లికొండ నాగేశ్వరావు, భోగి సత్యం, కొండపల్లి కృష్ణమూర్తి నాయుడు, వీరస్వామి, బంధం శ్రీను, ఉకే కుమారి మరియు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్, ఎర్ర వసంతరావు, స్థానిక నాయకులు యన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గుడిసెల తొలగింపులో తీవ్ర ఉద్రిక్తత





**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల కేంద్ర శివారులోని మల్లారం గ్రామం వద్ద శనివారం ఉదయం తీవ్ర ఉద్రిక్త నెలకొన్నది. గత ప్రభుత్వ హయంలో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా చేపట్టి మధ్యలో నిలిపివేయడంతో, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను స్థానిక పేదలు కొందరు గుడారాలు వేసుకొని ఆక్రమించుకున్నారు. దీంతో ఆక్రమణలను రెవెన్యు అధికారులు హెచ్చరించిన ఖాళీ చేయకపోవడంతో రెవెన్యూ సిబ్బంది పోలీసుల సాయంతో గుడారాలను పీకేస్తుండటంతో, పోలీసులకు అక్రమాదారులకు మధ్య తీవ్రఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఈక్రమంలో ఆక్రమణదారులు పోలీసుల ఎదుట డీజిల్ పోసుకునే ప్రయత్నం చేయటంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీస్‌ల మీద డీజిల్ పడటంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. పోలిస్‌ల విధిని అడ్డుకున్న వారిని పోలీసులు ఆక్రమణదారులను అదుపులోనికి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆ సమయంలో ఓ మహిళా స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే మహిళా పోలీస్‌లు ఆ మహిళను హుటాహుటిన పోలీస్ వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# శ్రీసిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావుకు మాతృవియోగం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలం బారుగూడెం పంచాయతీపరిధిలోని శ్రీసిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు, వీఏ డెవలపర్స్ అదినేత గరికపాటి ఆంజనేయప్రసాద్‌కు శనివారం మాతృవియోగం జరిగింది. వారి మాతృమూర్తి గరికపాటి వెంకటరత్నం(93) ఖమ్మంరూరల్ మండలం పోలెపల్లిపంచాయతీపరిధిలోని భద్రాద్రి కాలనీలో గల స్వగృహంలో తుదిశ్వాస విడిచింది. విషయం తెలుసుకున్న పలు పార్టీల నాయకులు, ప్రముఖులు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా వారి తండ్రి గత నెల రోజుల క్రితమే మృతి చెంది శోకసంద్రంలో ఉండగా.. మాతృమూర్తి మృతి చెండంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా నాయకులు వై. విక్రమ్, తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, బాలసాని లక్ష్మినారాయణ, మద్ది మల్లారెడ్డి, సబండి జగదీష్, భూక్య సురేష్‌నాయక్, బిఆర్‌ఎస్ జిల్లా నాయకుడు బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు, రియల్‌వ్యాపారులు, శ్రీసిటీ సిబ్బంది కోట గోపాల్‌రెడ్డి, ఉన్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సానుభూతిపరురాలు శేషమ్మ మృతి





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డుకు చెందిన సిపిఐ సానుభూతిపరురాలు మిడకంటి శేషమ్మ(73) అనారోగ్యంతో శనివారం ఇంటి వద్ద మృతి చెందారు. విషయం తెలుసుక్కు సిపిఐ జాతీయసమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన వెంకట్‌రెడ్డి, ఐఏఎల్ జాతీయ సమితి సభ్యులు ఓరుగంటి శేషగిరి, మండల సమితి సభ్యులు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, దండి రంగారావు, వెన్నం భాస్కర్,రామిడి రమేష్, వరంగల్‌క్రాస్‌రోడ్ శాఖ కార్యదర్శి వెంపటి సురేందర్, కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, మద్ది శ్రీనివాస్‌రెడ్డి, మద్ది వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోడౌన్‌ను సందర్శించిన రాయల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రఘునాథపాలెం మండల పరిధిలోని జింకలతండా క్రాస్ రోడ్డు వద్ద గల ప్రభుత్వ గోడౌన్‌ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు సందర్శించారు. శనివారం ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ గోడౌన్‌ను సందర్శించారు. గోడౌన్‌లో నిల్వ చేసిన సన్న బియ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాయల మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, హాస్టల్ విద్యార్థులకు అందించే బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా గోడౌన్‌లలో నిల్వ చేస్తున్నారని ఆయన తెలిపారు. సన్న బియ్యం పంపిణీలో ఎటువంటి అవకతవకలకు తావివ్వవద్దని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబిసి సెల్ జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం , స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రివేబిన్ ఆపరేటర్‌గా పదోన్నతులు కల్పించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి స్థానిక సత్తుపల్లిలో ఐఎన్. టి.యూ.సి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాల మేరకు కిష్టారం ఓసి మేనేజర్ రామకృష్ణకు ప్రివేబిన్ లో విధులు నిర్వహించే ఉద్యోగులకు ప్రివేబిన్ ఆపరేటర్‌గా పదోన్నతి కల్పించాలని ఫిట్ సెక్రటరీ గాజే బాలాజీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సింగరేణి సంస్థ యందు గత కొన్ని సంవత్సరాలుగా కిష్టారం ఓసిలో ప్రి వేబిన్ ఆపరేటర్ గా పని చేయుచున్న వారికి కన్వేర్ ఆపరేటర్ గా డెసిగ్నేషన్ ఇవ్వడం జరిగింది. కానీ వారు పని చేయుచున్నది కంప్యూటర్‌ను ఉపయోగించి ట్రక్ లోడింగ్, వ్యాగన్ లోడింగ్ వీరు చేయు పనికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేశ్వరరావు, కోటి, నజీర్, శ్రీనాథ్, అరుణ్, అన్వర్, హమీద్, నరసింహారాజు, వామనమూర్తి, పిచ్చయ్య, ధనాల రాము, యు.వెంకన్న, దారావత్ రమేష్, వేముల అశోక్, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా ఎన్‌టిఆర్ వర్ధంతి

ప్రజాపక్షం/సత్తుపల్లి: విశ్వ విఖ్యాత, నట సార్వభౌమ, తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని నలుదిశలా చాటిన మహనీయుడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి శనివారం పట్టణంలో పార్టీలకతీతంగా ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా. మట్టా దయానంద్ విజయకుమార్ పట్టణంలోని ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వావి జయబాబు, నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ ప్రతి ఒక్కరికి ఆదర్శంవంతుడన్నారు. నటన, రాజకీయాలను రెండు కళ్ళుగా భావించిన ఎన్టీఆర్ నటనతో ప్రేక్షకులను రంజింపచేయడమే కాకుండా, ముఖ్యమంత్రిగా నిరుపేదలకు సేవలందించి వారి ఆశీర్వాదాలు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో




మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజల రాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కమల్ పాషా, చలగుళ్ళ నరసింహారావు, దొడ్డా రాజేంద్రప్రసాద్(అమ్ములు), దొడ్డా కిషోర్, కొత్తూరు కోటేశ్వరరావు, వినుకొండ వెంకటరామయ్య, నాగరాజు, మానస నాని,తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం




ప్రజాపక్షం/ఆళ్లపల్లి: ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలో పర్యటించి ముందస్తుగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం చుట్టూ కాంపౌండ్ వాల్ అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో తహసీల్దార్ శకుంతల అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమారు 19 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మీ షాదీముబారక్ , సీఎంఆర్ఎఫ్, వికలాంగుల ఆర్థిక భరోసా చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు సముచిత ప్రాధాన్యం ఉంటుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ఏర్పడిన ఏడాది కాలంలో మహిళలకు పెద్దపీట వేసి అనే సంక్షేమ పథకాలు అమలు చేసిందని, నిరుపేదలు బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, ఆహార భద్రత కార్డులు అందజేస్తుందన్నారు. ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని ప్రతి ఒక్కరికి విడతల వారీగా ప్రభుత్వ పథకాలు అందజేస్తామని అన్నారు. మీ కుటుంబలో అనారోగ్య పాలై మెరుగైన వైద్యం చేపించుకోలేని, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామ నరసయ్య, పడిగ సమ్మయ్య, కాంగ్రెస్ మండల కోప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, మాజీ ఎంపీపీ పెండకట్ల పాపారావు, మాజీ సర్పంచ్ గలిగె సమ్మక్క, భరత్, ముప్పారపు రాము, వీరభద్రాచారి, సత్యనారాయణ, లబ్దిదారులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు సంక్షేమ పథకాలు

ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలం జగన్నాధపురంలో జరుగుతున్న కొత్త రేషన్ కార్డు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిన్న ఆకస్మాత్తుగా పరిశీలించిన అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు జగన్నాధపురంలో జరుగుతున్న కొత్త రేషన్ కార్డు సర్వేను కాంగ్రెస్ నాయకులు సురభి రాజేష్ పరిశీలించారు. జగన్నాధపురం గ్రామ పంచాయితీలో కొత్తగా 169 కుటుంబాలు రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నాయని ఆ కుటుంబాలకు సర్వే నిర్వహిస్తున్న సెక్రటరీ ఇబ్రహీం తెలిపినట్లు అన్నారు. ఈనెల 22వ తేదీన జరగబోయే గ్రామసభలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఆమోదించబడి 26వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న కొత్త రేషన్ కార్డుల పంపిణీ ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నాయకత్వంలో అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు రైతు భరోసా నిరుపేదలకు ఇందిరమ్మ



ఆత్మీయ భరోసా ఇందిరమ్మ ఇళ్లు అందుతాయన్నారు. సర్వేలు పంచాయితీ సెక్రటరీ ఇబ్రహీం, సూపర్వైజర్ సురేష్, ఎన్ఎస్‌యుఐ ములకలపల్లి మండల అధ్యక్షులు గుంటూరు సాయిరాం తదితరులు ఉన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహానికి ఘన నివాళి



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండలంలో వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ శనివారం విస్తృతంగా పర్యటించారు. ముందుగా కమలాపురంలో ఏర్పాటు చేసిన నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సభకు హాజరై, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. సామాజికంగా రాజకీయంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం మహిళల సమాన హక్కుల కోసం కృషి చేసిన మహానేత ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల కాంగ్రెస్ నాయకులుపాల్గొన్నారు.

# దొంగ వీలునామా సృష్టించి భూమిని కాజేయాలని చూస్తున్నారు..

ప్రజాపక్షం/కామేపల్లి: దొంగ వీలునామా సృష్టించి తమ భూమిని కాజేయాలని చూస్తున్నారని తమకు న్యాయం చేయాలని లేకుంటే పురుగుమందే దిక్కు అని దీవ్వెల రామచంద్రయ్య కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తూ తహసీల్దార్ ఆఫీస్ ముందు పురుగు మందు డబ్బాలతో శనివారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని రామకృష్ణాపురం



గ్రామానికి చెందిన బాధితుడు రామ నరసయ్య తహసీల్దార్ ఆఫీస్ ముందు మాట్లాడుతూ కామేపల్లిలో తన స్వాధీనంలో తన తండ్రి పేరు మీద ఉన్న 10 ఎకరాల భూమి ఉందని దానిని కాజేయడానికి ఏలూరి జయమ్మ, దీవ్వెన చల్లమ్మ, దామోదర్‌లు కలిసి నకిలీ వీలునామా సృష్టించి రెవెన్యూ అధికారులను తప్పు దోవ పట్టిచ్చి తమ భూమిని కాజేయటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్ జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని లేకుంటే పురుగు మందు తాగి ఆత్మ హత్య చేసుకోవడమే శరణ్యమని అన్నారు. దీనిపై స్థానిక తహసీల్దార్ సుధాకర్ ను వివరణ కోరగా వీలునామా ప్రకారం వ్యవహరిస్తామని తెలిపారు. రామ చంద్రయ్య వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

ప్రజాపక్షం/దమ్మపేట: మండల వ్యాప్తంగా ఇఎమ్ఆర్ మరియు ఐటీడీఏ నిధులు సుమారు 3 కోట్ల 35 లక్షల రూపాయలతో మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దమ్మపేట మండల



కేంద్రంలో ఉన్న జడ్పిటిసి పాఠశాలలో సీసీ రోడ్డు శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే మాట్లాడుతూ జడ్పిటిసి పాఠశాల అభివృద్ధి చేయడం తన కర్తవ్యం అన్నారు. రాబోయే రోజుల్లో ఈ పాఠశాలలు మరింత అభివృద్ధి చేస్తానన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఎఎంసి చైర్మన్ వాసం రాణి, కమిటీ సభ్యురాలు సొంగ ఏసుమణి, సొసైటీ చైర్మన్ ఏలిన రాఘవరావు, మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్, కాంగ్రెస్ పార్టీ దమ్మపేట టౌన్ ప్రెసిడెంట్ చిన్న శెట్టి చిట్టి బాబు, రావు గంగాధర్ రావు, చిన్నంశెట్టి యుగంధర్, ముళ్ళపూడి వెంకటేశ్వరరావు, పగడాల రాంబాబు, ఎరల్లగోళ్ళ రాధాకృష్ణ, ఎర్ర వసంతం, రొయ్యల కుమార్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్యకర్తల కష్టంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది..

ప్రజాపక్షం/కరకగూడెం: కార్యకర్తల కష్టంతోనే ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని, నిస్వార్థ కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం అని ఆ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. శనివారం కరకగూడెం మండలంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు, అభిమాన నేత పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కన్నాయిగూడెం, రేగళ్ల, అనంతారం, తుమ్మలగూడెం, చోప్పాలా, గొల్లగూడెం, కొత్తగూడెం గ్రామాల కాంగ్రెస్ పార్టీ నూతన గ్రామ కమిటీ అధ్యక్షులలను నియమించారు. బాదావత్ అమిలాల్(కన్నాయిగూడెం), కొమరం వెంకటేశ్వర్లు (రేగళ్ల), పూజారి వెంకన్న (అనంతారం), ఎట్టి నరసయ్య (చొప్పాలా), ఆంబోజు నరేష్ (తుమ్మలగూడెం), ఎల్లబోయిన బుచ్చయ్య (గొల్లగూడెం), ఈసం రాఘవులు (కొత్తగూడెం)లను ఏకగ్రీవంగా ఎన్నుకొని గ్రామస్తులతో కలిసి సమావేశం నిర్వహించి పెద్దలందరి సమక్షంలో అధ్యక్షులలను నియమించారు. ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ మండల నాయకులు పోలేబోయిన తిరుపతయ్య, మండల నాయకులు ఎర్ర సురేష్, దొంతు మల్లయ్య, గాంధర్ల రామనాథం, దుర్గం కన్నయ్య, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి

ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల, చిరునోముల, బోనకల్, రావినూతల తదితర గ్రామాల్లో తెలుగుదేశం వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29 వర్ధంతిని శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రావుట్ల సత్యనారాయణ, నాయకులు మైనేని రవికుమార్, గుడారి వెంకయ్య, అమీద్‌బాబు, నల్లమోతు నాగేశ్వరరావు, చెంగల ముత్తయ్య, శ్రీకాంత్, బొల్లం శ్రీను, వెంకటేశ్వరరావు, నంబూరి చందర్రావు తదితరులు పాల్గొన్నారు.



# నందమూరి తారక రామారావుకు నివాళి

ప్రజాపక్షం/వైరా: వైరాలో మాజీ ముఖ్యమంత్రి విశ్వవిఖ్యాత నట సార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ శనివారం మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, చెరుకూరి చలపతిరావు, కాంగ్రేస్ తెదేపా నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిలారు సురేందర్, మన్నంపల్లి చైర్మన్ సూతకాని జైపాల్, మందడపు మధుసూదన్‌రావు, బోళ్ళ గంగారావు, మోతుకూరి వెంకటేశ్వరరావు, బొల్లెపల్లి శ్రీను, చింతల శ్రీనివాసరావు, కోడెదాసు, పర్స రామకృష్ణ, పమ్మి అశోక్, చావా కాంతారావు, రమేష్, నారాయణ, కట్టా నర్సింహారావు, వెంకన్న, మురళి, సత్య, పొదిల హరినాథ్, రాజశేఖర్, గుమ్మా రోశయ్య, మిట్టపల్లి నాగి తదితరులు పాల్గొన్నారు.



# అట్టహాసంగా కేవీపీఎస్ మండల మహాసభ

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలం వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని తమ్మినేని సుబ్బయ్య భవన్‌లో కేవీపీఎస్ మండల మహాసభను శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆరెంపుల ఉప్పలయ్య, కార్యదర్శిగా పగిడపల్లి వెంకట్రావుతో పాటు 16మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలేరునియోజకవర్గ సిపిఎం కార్యదర్శి బండి రమేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్, నాయకులు పాపిట్ల సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు ఊరడి సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పొన్నెకంటి సంగయ్య, నంద్ర ప్రసాద్, నందిగామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడాకారులు తమ ప్రతిభతో జాతీయస్థాయికి ఎదగాలి

కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని






ప్రజాపక్షం/పాల్వంచ : గెలుపు, ఓటమిని క్రీడాకారులు సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు క్రీడాకారులకు సూచించారు. పాల్వంచ లోని డ్రిగీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన కోకో, కబడ్డీ ఆటలలో గెలుపు పొందిన విజేతలకు ముఖ్యఅతిధిగా హాజరైన కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు జట్లకు బహుమతులు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనం నేని మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదని, వారికి కావాల్సిన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ మాట్లాడుతూ..కాలేజీకి ప్రహరీ గోడ, ఇతర సమస్యలు ఎమ్మెల్యే దృషికి తీసుకువచ్చారు. జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబర్చి జిల్లాకు వన్నె తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ తహసీల్ధార్ వివేక్, కళాశాల లెక్చరర్స్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు అడుసు మల్లి సాయిబాబు, వీశంశెట్టి పూర్ణచందర్‌రావు, సీపీఐ నాయకులు మన్నెం వెంకటేశ్వరరావు, విజయ్, ముత్యాల కిరణ్‌కుమార్, వైఎస్ గిరి, యాకయ్య, ఆదినారాయణ, రామ్, చందర్ పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి



ప్రజాపక్షం/భద్రాచలం : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు చోట్ల ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. ప్రధానంగా భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్‌లో ఉన్న నిలువెత్తు విగ్రహానికి గజమాలను వేసి నివాళ్లర్పించారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యాతిధిగా విచ్చేసిన స్థానిక ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ తెలుగుజాతి కీర్తిని దశదిశలా చాటిన ఏకైక రాజకీయవేత్త, మహానాయకుడు ఎన్‌టిఆర్ అన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే రాజకీయ కురక్షేత్రంలో విజయాన్ని సాధించి ముఖ్యమంత్రి పదవిని అదిరోహించారని చెప్పారు. ఆయన భౌతకంగా మనమధ్య లేకున్నా ఆయన ఆశయాలు, స్ఫూర్తి ప్రతీ తెలుగువాని నరనరాల ఉన్నాయని, ఎన్ని ప్రాంతీయపార్టీలు పుట్టుకొచ్చినప్పటికీ తెలుగుదేశం పార్టీకి ఓ ప్రత్యేకత ఎప్పటికీ ఉండిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొడాలి శ్రీనివాస్, షేక్ అజీం, కంభంపాటి సురేష్, అబ్బినేని శ్రీనివాస్,కుంచాల రాజారామ్, కేనేరు రాము, అడుసుమల్లి జగదీష్, చల్లగుళ్ల నాగేశ్వరరావు, కొర్లపాటి రాము, దేశప్ప, చిట్టిబాబు, దాసయ్య, సీత, గౌతమి, అచ్యుత రావు, చంటి, అశోక్, ఆకోజ్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్‌టిఆర్ వర్ధంతి వేడుకలు



ప్రజాపక్షం/ఏన్కూరు: మండల కేంద్రమైన ఏన్కూరులో దివంగత నేత ఉమ్మడి ఆధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు శనివారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొనకంచి రామకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు ప్రధాన కూడలిలో గల ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. టిడిపి మాజీ ఎంపిపి ఆర్‌ఎం వరలక్ష్మి, మాజీ జెడ్పిటిసి కోపెల శ్యామల చేతుల మీదుగా పండ్లు పంచిపెట్టారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ సినీ రంగంలో ఎన్నో పాత్రలో పోషించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. నిరుపేదలకు రూ.2లకే రేషన్ బియ్యం అందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. దేశ రాజకీయాల్లో తెలుగుజాతిని కాపాడిన గొప్ప నాయకుడని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లూరు అప్పారావు, ఆరెం రామయ్య, నామ వెంకయ్య, మాదినేని బాబురావు, మేడా ధర్మారావు, జాస్తి జనార్ధన్, పొన్నం హరికృష్ణ, సాయిలు, నాగయ్య, కొమ్మూరి శంకరయ్య, మాదినేని అశోక్, కంచర్ల శ్రీను, వేణు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర్లుకు అండగా ఉంటాం

మున్నూరుకాపు సంఘం జిల్లా నాయకులు



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిదిలోని తనికెళ్లగ్రామానికి చెందిన పెంటికల వెంకటేశ్వర్లు ఇటీవల ప్రమాదంలో పెద్దప్రేగు పగిలిపోయి ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. శనివారం మున్నూరుకాపు సంఘం జిల్లా నేతలు ప్రాణాపాయస్తితిలో ఉన్న వెంకటేశ్వర్లును ఆరోగ్య ఆసుపత్రిలో పరామర్శించారు. పెద్దప్రేగుకు మర్పిడి శస్త్ర చికిత్స చేశారు. డాక్టర్‌లను రోగి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. అత్యధిక ఖర్చు కావడంతో ఆరోగ్య హాస్పిట్ చైర్మన్ డాక్టర్ సుమంత్ మానవతా ధృక్పదంతో ఆలోచించి డాక్టర్ల బృందంతో వైద్య సహాయాన్ని అందిజేస్తున్నారని తెలిపారు. కుటుంబసబ్యులకు ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. తల్లి, భార్య, పిల్లలను ఓదార్చారు. భయపడొద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, సీనియర్ పాత్రికేయులు ఆకుతోట ఆదినారాయణ, సంఘం సీనియర్ నాయకులు తోట రామారావు, పట్టణ అధ్యక్షుడు మదూరి పూర్ణ, సంఘం నాయకులు ముత్యం ఉప్పలరావు, జిల్లా కాంగ్రేస్ నాయకులు తాళ్లూరి హనుమంతురావు, బిఆర్‌ఎస్ నాయకులు గుండ్లపల్లి శేషగిరిరావు, తనికెళ్ల గ్రామం సిపిఐ నాయకులు పివిరావు, ఎస్టీయు సంఘం నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు, పాల్గొన్నారు.

# రూ.11 లక్షల గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్ట్ - కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాపక్షం/భద్రాచలం : ఒడిస్సా నుండి ఉత్తర్‌ప్రదేశ్‌కు అక్రమంగా తరలించుకుపోతున్న 31.06కేజీల గంజాయిని శనివారం భద్రాచలం సమీపంలో ఎక్సైజ్ ఎన్ఫోర్మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఒడిస్సాలో కొనుగోలు చేసిన రూ.11 లక్షల విలువచేసే గంజాయిని యుపి లోని బాండా జిల్లాకు చెందిన అంజనీ కుమార్ సంజీవ్ కుమార్ లు యుపి 78బిబి 9459 నెంబర్ గల కారులో గంజాయి తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు స్థానిక ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈ తనీఖిల్లో పలు వాహనాలు ఆపి సోదాలు చేస్తుండగా యూపికి చెందిన ఓ కారు అటుగా రావడంతో ఆపి తనిఖీ చేయడంతో ఆ కారులో గంజాయిని గుర్తించారు. దీంతో కారుతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాదీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. గంజాయి పట్టుకున్న వారిలో ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ ఎంఏ కరీం, కానిస్టేబుల్ సుధీర్, వెంకటేశ్వర్లు, హరీష్, విజయ్, ఆనంద్, హనుమంత్, ఉపేందర్ తదితరులున్నారు.

# రైతు భరోసాపై సర్వే

ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:



అన్నపురెడ్డిపల్లి మండలంలో రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసాను అమలు చేయుట కొరకు సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో భాగంగా మండల తహసీల్ధార్ జగదీశ్వర్ ప్రసాద్ మండలంలో ఉన్నటువంటి భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది ఉండి వాటిని వ్యవసాయ పనులకు వినియోగింకుండా, పారిశ్రామికంగా ఇటువ బట్టీలకు, జామాయిల్ క్ర అర్ధిలకు, వివిధ రకాల పరిశ్రమలకు వినియోగిస్తున్న భూములను గుర్తించి వాటిపై సర్వే నిర్వహించారు. ఇటువంటి భూములకు తప్పకుండా నాలా అనుమతులు తీసుకొని వ్యాపారాలు నిర్వహించుకోవాలని లేని పక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని సంబంధిత రైతులకు తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి అనూష, గిర్ధవర్ మధు, సర్వేయర్ వినయ్, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్‌టిఆర్ 29వ వర్ధంతి

ప్రజాపక్షం/అశ్వాపురం:




నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా హెవీ వాటర్ ప్లాంట్ టిఎన్‌యుసి వారు కాలనీ గేట్‌లో ఎన్టీఆర్ ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా టిఎన్‌టియూసి కన్వీనర్ కూరపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ టిడిపి అధ్యక్షులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆయన దివికేగిన ఆయన చేసిన అభివృద్ధి, సేవలు అందరి మనసుల్లో ఎప్పటికీ ఉంటాయని అన్నారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ రాయల రాజేష్, ఎస్‌కే యూసుఫ్, మండల అధ్యక్షులు తుళ్లూరు ప్రకాష్‌రావు, రాయల్ భాస్కరరావు, రాయల సత్యనారాయణ, కందులు శ్రీనివాసరావు, తాజుద్దీన్, బాజీబాబా, కాకాని రామచంద్రరావు, కిషోర్, శివకామేశ్వరి గ్రూప్ డైరెక్టర్ పిచ్చేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ల్యాండ్‌లో డబుల్ రిజిస్ట్రేషన్‌లు పొరపాటు జరిగాయి

-వైరా సబ్ రిజిస్ట్రార్‌కు సంజాయిషీ లెటర్

ప్రజాపక్షం/కొణిజర్ల : గత ఏడాది డిసెంబర్ 28న రాత్రిపూట జరిగిన రిజిస్ట్రేషన్‌లలో ప్లాట్‌నెంబర్ 6, 80, 10, 134, 135 కు సంబందించి విక్రయ లావాదేవీలు తప్పుగా జరిగాయని తమ దృష్టికి వచ్చిందని పర్యవేక్షణ లోపం కారణంగా పై నెంబర్లలోగల విల్లాలు డబల్ రిజిస్ట్రేషన్ జరిగాయని తాము గుర్తించినట్లు గ్రీన్‌ల్యాండ్ నిర్వాహకుడు మక్కెన రాము వైరా సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ అందించారు. ఇట్టి విషయాన్ని ఇప్పటికే సంబందిత కొనుగోలు దారులకు తెలియజేశామని విక్రయ లావాదేవీల రద్దుకు వారు సహకరించడానికి ముందుకు వచ్చారని తెలిపారు. సంబందిత రిజిస్ట్రేషన్ లు రద్దు పరచడానికి తాము సిద్దంగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాల్ కార్యాలయం వద్ద తెలంగాణ మున్సిపాల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి) ఆధ్వర్యంలో కార్మికుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసురత్నం, రాష్ట్ర సహాయ కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈస ందర్భంగా రాష్ట్ర ప్థాన కార్యదర్శి కె.యేసురత్నం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాల్ కార్మికులందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఏఐఇయుసి ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు గారపాటి అశోక్, మున్సిపాల్ యూనియన్ నాయకులు రాయపూడి శ్రీను, పిడియాల లక్ష్మ య్య, స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.